
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం। 7। అక్టోబర్। 2025



సోమశిలలో 73.024 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 73.024 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 12,992 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నానదికి 2650, ఉత్తరకాలువకు 100, కండలేరుకు 4 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,23,000
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.11,099
3 శాతం జీఎస్టీతో	రూ.11,423
నవర (8 గ్రా)	రూ.91,384

గరిష్టం/కనిష్టం
35.9 /26.7

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉరుములు, మెరుపులతో ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. సోమవారం గాలిలో తేమ 53 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ప్రైవేట్ ట్రావెల్స్‌ల్లో తనిఖీలు

- 115 కేసుల నమోదు
- రూ.11.41 లక్షల జరిమానా వసూలు



ప్రైవేట్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా అధికారులు

నెల్లూరు (టౌన్)/వెంకటాచలం: దసరా పండగ నేపథ్యంలో సూదూర ప్రాంతాలకు వెళ్తున్న ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై రవాణాశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మూడు రోజులుగా జిల్లాలోని వెంకటాచలం, కోవూరు, బోగోలు ప్రాంతాల్లోని జాతీయ రహదారిపై బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. అధిక చార్జీలు వసూలు చేస్తున్న 115 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఆయా బస్సుల నుంచి రూ.11.41 లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ సందర్భంగా డీటీసీ చందర్ మాట్లాడుతూ పండగల పేర్లు చెప్పి ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే బస్సుల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎంవీఐలు బాలమురళీ, రఫీ, పవన్‌కార్తీక్, ఏఎంవీఐలు స్వప్నిల్‌కుమార్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ హిమాన్షు శుక్లా




హిమాన్షుశుక్లా

నెల్లూరురూరల్: జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులను అరికట్టేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అంతర్గత తనిఖీ బృందాలను నియమించినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, అక్రమ యూరియా నిల్వలపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ఈ సమస్యలపై ఫిర్యాదులు ఉన్నట్లయితే రైతులు వెంటనే జిల్లా వ్యవసాయ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 83310 57285కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. ఇప్పటికే ప్రత్యేక బృందాలు తనిఖీలను ముమ్మరం చేసినట్లు చెప్పారు. డీలర్లు, గోదాములు, స్టాక్ పాయింట్లలో యూరియా సరఫరా, నిల్వలు, వినియోగంపై సమగ్ర స్టాక్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమలకు అక్రమ రవాణా, అనధికార వినియోగాన్ని అరికట్టడం, క్రమం తప్పకుండా ఫీల్డ్ స్థాయి తనిఖీలు చేయడం, వ్యవసాయ అధికారులను సమన్వయం చేస్తూ పర్యవేక్షణ చేయడం ఈ ప్రత్యేక బృందాల ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఉల్లంఘనలకు పాల్పడిన డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతోపాటు, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేటి నుంచి అండర్-19 ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఎంపికలు

నెల్లూరు (టౌన్): ఉమ్మడి నెల్లూరు జిల్లా ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జిల్లా స్థాయి ఎంపికలు మంగళవారం నుంచి జరగనున్నట్లు డీవీఈఓ కృష్ణారెడ్డి, ఆర్ఐఓ వరప్రసాదరావు, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాటూరు వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి ఎంపికలు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం జరుగుతాయన్నారు. 7న అథ్లెటిక్స్, 8న ఖోఖో, 9న కబడ్డీ, 10న వాలీబాల్, సాఫ్ట్‌బాల్, హాకీ, 11న హ్యాండ్‌బాల్, 12న షటిల్ బ్యాడ్మింటన్, 13న క్రికెట్ ఎంపికలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయి ఎంపికల్లో పాల్గొను విద్యార్థులు 2007 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 83,412 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 33,058 మంది భక్తులు తలనీలాలు అర్పించుకున్నారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందుగా క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

మెడికల్ కళాశాలలపై కూటమిది ద్వంద్వ వైఖరి

- ప్రైవేటీకరణను సమష్టిగా పోరాడి అడ్డుకుందాం
- ముక్తకంఠంతో వివిధ వర్గాల పిలుపు



డీఆర్ ఉత్తం హోటల్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీలు చంద్రశేఖర్ రెడ్డి, మేరిగ మురళి, ఆనం విజయకుమార్‌రెడ్డి, సీపీఎం, సీపీఐ, వైఎస్సార్‌సీపీ నాయకులు, డాక్టర్లు, మేధావులు, విద్యావంతులు తదితరులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే నిర్మాణాలు పూర్తయిన, చివరి దశలో ఉన్న మెడికల్ కళాశాలలపై కూటమి సర్కార్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, పౌర హక్కుల సంఘాలు, మేధావులు, తల్లిదండ్రులు, చట్టసభల సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం, యువజన విభాగం ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో నగరంలోని డీఆర్ ఉత్తమ్ హోటల్‌లో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు వైద్య విద్యకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకుంటూ ఉద్యమించాల్సిందేనని నిర్ణయం తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున, నగర అధ్యక్షులు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే.. ప్రైవేటీకరణ



మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు మేలు చేసేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని బాబు జీర్ణించుకోలేక, మా నాయకుడికి పేరు వస్తుందనే ఓర్వలేకనే ప్రైవేటీకరణకు పూనుకున్నారు. – మొయిళ్ల గౌరి, వైఎస్సార్‌సీపీ మహిళ జోనల్ అధ్యక్షురాలు

చంద్రబాబు అభివృద్ధి విఘాతకుడు



చంద్రబాబు విజనరీ అంటూ డబ్బా కొట్టుకుంటాడు. ఆయన అభివృద్ధి విఘాతకుడు. పేద ప్రజలు వైద్యవిద్యను అభ్యసించడం, పేదలకు మెరుగైన వైద్యం అందించాలంటే ప్రభుత్వ వైద్య రంగానికే సాధ్యమం. పేదలకు ఎంతో ఉపయోగపడే ఈ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే నిర్ణయం మార్చుకోవాలి. – కె సునంద, నెల్లూరు జీజీహెచ్ కమిటీ మాజీ చైర్‌పర్సన్

విద్య ప్రైవేటీకరణ ప్రమాదకరం



వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వ్యాపారమే. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన జీఓలను మంత్రులు లోకేశ్, పవన్‌కళ్యాణ్ తీవ్రంగా విమర్శించారు. ఇప్పుడేమో ఆ జీఓలకు వ్యతిరేకంగా వాళ్లే ప్రైవేటీకరణకు పూనుకోవడం ఎంతో ప్రమాదకరం. – డాక్టర్ ఎంవీ రమణయ్య, ప్రజారోగ్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు

ప్రజలను పిచ్చోళ్లను చేయడమే



మెడికల్ కళాశాలను ఒక పక్క ప్రైవేటీకరణ చేస్తామంటూనే మరో పక్క ప్రజలకు ఉచిత ఓపీ సౌకర్యం కల్పిస్తామని చెప్పడం పిచ్చోళ్లను చేయడమే. జగన్ మోహన్‌రెడ్డి ఆరు కళాశాలలను సిద్ధం చేశాడు. ఇది నిజంగా సాహసం. ఎవరైనా అభినందించక తప్పదు. – అరిగెల నాగేంద్రసాయి, సీపీఐ జిల్లా కార్యదర్శి

ప్రైవేట్‌పరం చేయడం దుర్మార్గం



విద్య, వైద్యం ప్రైవేట్ పరం చేయడం దుర్మార్గం. వైఎస్ జగన్ తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని ఇప్పటి ప్రభుత్వం కొనసాగిస్తే ఎంతో ఉపయోగకరం. 17 కళాశాలల్లో ఆరు కళాశాలలు పూర్తయితే వాటిని సైతం ప్రైవేట్‌పరం చేస్తామనడం ప్రభుత్వ వ్యాపార ధోరణికి నిదర్శనం. – యల్లంకి వెంకటేశ్వర్లు, జిల్లా సెక్రటరీ ప్రజాపౌరహక్కుల సంఘం

ప్రైవేటీకరణ పలాయన ధోరణి



మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలనుకోవడం పలాయన ధోరణికి నిదర్శనం. మెడికల్ కళాశాలల విషయంలో రెండు సార్లు ఫిర్యాదు చేశాం. అయినా చర్యలు తీసుకోలేదు. మెడికల్ కళాశాలలను కూడా ప్రైవేటీకరణ చేస్తే పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు సాధించడం కష్టతరం. – నరహరి, ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఉద్యమ కార్యాచరణ అవసరం



ప్రజల పక్షాన ఉద్యమించాల్సిన వామపక్షాల పనిని ప్రతిపక్షంలో ఉండి వైఎస్సార్‌సీపీ చేపట్టడం అభినందనీయం. ప్రభుత్వం వ్యాపార ధోరణితో తీసుకునే నిర్ణయాలతో ప్రజలకే నష్టం. ఈ నిర్ణయాన్ని అడ్డుకునేం దుకు భారీస్థాయిలో ఉద్యమించేందుకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాల్సిన అవసరం ఉంది. – సునీల్‌కుమార్, – పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ కళాశాలల్లో చేరడం లేదంట



ప్రభుత్వ దుర్మార్గపు పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రభుత్వ కళాశాలల్లో అవసరాలపై మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేస్తే అసలు ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు చేరడం లేదని చెప్పడం హాస్యాస్పదం. ప్రభుత్వం వ్యాపారానికి తెరతీస్తూ పీపీ అని చెప్పడం ఎంత వరకు సమంజసం. – షారూక్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి

ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు



కూటమి నిర్ణయాన్ని ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. పీ3 విధానం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ఆశలు అడియాశలయ్యాయి. సుమారు 1800 మంది విద్యార్థులు నష్టపోతున్నారు. ప్రైవేటీకరణ చేయడంతో భవిష్యత్ తరం భారీగా నష్టపోతుంది. – మస్తాన్, ఏఐఎస్ఎఫ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి

ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి



కళాశాలల ప్రైవేటీరణను వ్యతిరేకించాలి. విద్య, వైద్యం భావితరాల భవిష్యత్. రాజులు ప్రజాప్రయోజనాలు, వారి భవిష్యత్ కోసం నిర్ణయాలు తీసుకునేవారు. ఇప్పుడు ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వాలు ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. – రామ్మోహన్‌రెడ్డి, విశ్రాంత అధ్యాపకుడు

దోచి పెట్టేందుకే.. ప్రైవేటీకరణ



మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ కార్పొరేట్ వ్యక్తులకు దోచి పెట్టడానికే. మెరుగైన వైద్యం పేద ప్రజలకు అందించడం ప్రభుత్వ బాధ్యత కాదా?. ప్రభుత్వం చేపట్టాల్సిన కార్యక్రమాలను ప్రైవేట్‌పరం చేయడం దుర్మార్గం. – దశరథరామయ్య, విశ్రాంత ప్రిన్సిపాల్, సర్వోదయ కళాశాల

వైద్య విద్య కలగా మిగిలిపోకూడదు



మెడికల్ ప్రైవేట్‌పరం చేయడం సమాజానికి ఏ మాత్రం లాభం లేదు. పేద విద్యార్థులు మెడిసిన్ చదవాలనే కల.. కలగానే మిగిలిపోకూడదు. ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. ప్రజల ఆరోగ్యం, పేద విద్యార్థుల వైద్య విద్య తీవ్ర నిరాశకు గురవుతోంది. – విద్యాధర్, ప్రముఖ న్యాయవాది



కాకాణికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న కొడవలూరు ధనుంజయరెడ్డి

భావితరాలకు శాపం



మెడికల కళాశాల విషయంలో బాబు నిర్ణయం భావితరాలకు శాపమం. ప్రైవేటీకరణ వల్ల ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు వైద్యవిద్యను అభ్యసించాలన్న కల కలగానే మిగిలిపోతోంది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేరొస్తుందనే తట్టుకోలేక కుట్రలు పన్నుతున్నారు. వైద్య విద్యను ఆర్థికంగా వెనుకబడిన వారికి అందజేసిన ఘనత దివంగత సీఎం డాక్టర్ రాజశేఖర్‌రెడ్డిది. నా తమ్ముడు, నా కుమారుడు వైద్యవిద్యను పూర్తి చేశారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను మరో స్వాతంత్య్ర ఉద్యమంలా చేయాల్సిన అవసరం ఉంది. – మేరిగ మురళీధర్, ఎమ్మెల్సీ

వైఎస్ జగన్‌ది దూర ఆలోచన



పేద విద్యార్థుల మెడికల్ కలను సాకారం చేసేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది 'దూర' ఆలోచన చేస్తే.. చంద్రబాబు స్వార్థంతో, కుట్రలతో 'దుర' ఆలోచన చేస్తున్నాడు. ప్రైవేటీకరణతో పేద విద్యార్థులు చదువుకోలేరు. ప్రైవేట్ వైద్యశాలల్లో పేదలకు మంచి వైద్యం అందే పరిస్థితి ఉండదు. విద్య, వైద్యం పేదలకు అందాలంటే ప్రభుత్వమే నిర్వహించాలని విజనరీ అని చెప్పుకునే చంద్రబాబుకు లేకపోవడం బాధాకరం. కూటమి నిర్ణయాలకు సమయం వచ్చినప్పుడు ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. – ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్

ప్రభుత్వమా? వ్యాపార సంస్థా?



చంద్రబాబు రాష్ట్రాన్ని దోచుకునేందుకు ప్రభుత్వ వ్యవస్థలను ప్రైవేటపరం చేస్తున్నాడు. ప్రభుత్వాన్ని వ్యాపార సంస్థగా మార్చేస్తున్నాడు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వ్యాపార ధోరణికి ఉపయోగిస్తుంది. పేద ప్రజలకు ఉపయోగపడని ప్రైవేట్ ఆస్పత్రుల వల్ల వచ్చే ఇబ్బందులు కూటమి ప్రభుత్వానికి తెలియవా?. కూటమి కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి అడ్డుకుంటేనే భవిష్యత్ తరాలకు మేలు చేసినవాళ్లమవుతాం. – పేర్నాటి కోటేశ్వరరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్

ఇసుక, మట్టి మా సొంతం

- జమ్మిపాళెం నుంచి విచ్చలవిడిగా అక్రమ రవాణా
- మాఫియాకు అధికారం అండదండలు
- మామూళ్ల పేరుతో రూ.లక్షల్లో వసూళ్లు
- చూసీ చూడనట్లుగా అధికారులు

కోవూరు: పెన్నానదిలో అసలు ఇసుక తవ్వకాలకు ఎక్కడా అనుమతి లేదు. పెన్నానదిలో ఇసుక తవ్వకాలు చేపట్టాలంటే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతితోనే జిల్లా మైనింగ్, జలవనరుల శాఖ అనుమతి వ్వాల్సి ఉంది. వాస్తవానికి ఈ నెల 15వ తేదీ వరకు నదుల్లోనే కాదు.. వాగుల్లో కూడా ఇసుక తవ్వకాలపై నిషేధం అమల్లో ఉంది. అయినా అధికార పార్టీ నేతలకు ఇవేమి పట్టడం లేదు. పర్యావరణ, వాల్టా చట్టం నిబంధనలు ఉల్లంఘించి టీడీపీ నేతలు పెన్నానదిని కుళ్లబొడిచి విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతుంటే మైనింగ్, జలవనరులు, రెవెన్యూ, పోలీస్ శాఖలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిత్యం 100 ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా

మండలంలోని జమ్మిపాళెం వద్ద పెన్నానది నుంచి నిత్యం 100 ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బావుల్లాంటి గోతులు పెట్టి ఇసుక తవ్వేయడంతో ప్రమాదకర స్థాయిలో గుంతలు ఏర్పడుతున్నాయి. పెన్నానదిలో ఇసుక తవ్వకాలపై ప్రశ్నిస్తే మాఫియా బహిరంగంగానే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. 'కూటమి ప్రభుత్వం ఉన్నంత వరకు అధికారులు ఎవరు మా జోలికి రారు, పెన్నానదిలో ఉండే ఇసుక, మట్టి మాకే సొంతం. మాకు అధికార పార్టీ అండదండలు ఉన్నాయి. మా ఇసుక ట్రాక్టర్లు, మట్టి ట్రాక్టర్లకు ఎవరైనా అడ్డొచ్చినా ఒప్పుకోం.. మమ్మల్ని కాదని నదిలో దిగారంటే ట్రాక్టర్లూ సీజ్ అవుతాయి' అంటూ బాహాటంగా హెచ్చరిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

పర్యావరణంపై ఆందోళన

పెన్నానదిలో ఇసుక తవ్వకాల విషయం అటుంచితే.. రేయింబవళ్లు ఇసుక ట్రాక్టర్లు రాకపోకలతో రణగొణ ధ్వనులతో తమకు ప్రశాంతత కొరవడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు దెబ్బతిన్నాయని, వర్షం పడితే బురద, ఎండితే దుమ్ముతో అల్లాడిపోతున్నామంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక తవ్వకాలతో తమ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు.

కప్పం కట్టు.. ఇసుక తోలుకో..

జమ్మిపాళెం పరిధిలో ఉండే ట్రాక్టర్లు మాత్రమే పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలించేందుకు అనుమతి ఇస్తున్నారు. ఎవరైనా బయట వ్యక్తులు ఇసుక కావాలంటే.. ఇసుక విలువ కప్పం కడితేనే అనుమతిస్తామని, లేదంటే సీజ్ చేయిస్తామని అధికార పార్టీ నేతలు బాహాటంగానే చెబుతున్నారు. అధికార పార్టీ నేతలు ఈ స్థాయిలో బరితెగించి వ్యవహరిస్తున్నారంటే అధికార వ్యవస్థలు వీరికి ఏ విధంగా సాగిలపడుతున్నాయో అర్థమవుతోంది.

ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. మండలంలోని జమ్మిపాళెం ప్రాంతంలో పెన్నానదిని అడ్డాగా చేసుకుని కుళ్లబొడిచేస్తున్నారు. ఏ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించి విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. పెన్నానది మాది.. ఇసుక, మట్టి మా సొంతమే.. ఎవరైనా అడ్డొస్తే మీ సంగతి తేలుస్తామంటూ స్థానిక గ్రామస్తులను బహిరంగంగానే బెదిరిస్తున్నారు. స్థానికులు తమ ఇంటి అవసరాలకు కూడా ఇసుక తరలించడానికి వీల్లేదంటూ, తమను కాదని నదిలోకి దిగితే సీజ్ చేయిస్తామంటూ బాహాటంగానే హెచ్చరిస్తున్నారంటే అధికార వ్యవస్థలు అధికార పార్టీ నేతలకు ఏ విధంగా సాగిలపడి ఊడిగం చేస్తున్నాయో అర్థమవుతోంది.



పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

మెడికల్ అధికారులకు పదోన్నతులు కల్పించాలి



సంఘీభావం ప్రకటిస్తున్న ఏపీ హంస జిల్లా నాయకులు

నెల్లూరు (టౌన్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలందిస్తున్న వైద్యులకు నిర్ణీత కాల వ్యవధిలో పదోన్నతులు కల్పించాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న వైద్యులకు సంఘీభావం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యులకు 25 ఏళ్లుగా పదోన్నతులు లేవన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక సర్జన్, ఇద్దరు డిప్యూటీ సివిల్ సర్జన్‌ను నియమించాలన్నారు. సర్వీసు పీజీ కోటా 20 శాతం విధానాన్నే కొనసాగించాలన్నారు. సంచార చికిత్స కార్యక్రమానికి రూ.5 వేలు భత్యం మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ హంస జిల్లా సెక్రటరీ కమల్‌కిరణ్, కోశాధికారి శేషగిరిరావు, పబ్లిసిటీ సెక్రటరీ మజూర్, నాయకులు రాజయ్య, మురళీ, నాగరాజు, వరప్రసాద్, గౌస్‌బాషా, సుధాకర్‌రెడ్డి, లక్ష్మీనరసయ్య, లక్ష్మీకాంతమ్మ, వింధ్యావళి తదితరులు పాల్గొన్నారు.

జమీన్‌రైతు ఎడిటర్‌పై 'ఆనం' అక్కసు

నెల్లూరు (అర్బన్): మద్దతు ధరకు ధాన్యం కొనకుండా రైతుల కడుపు కొట్టారనే నిజాన్ని జమీన్‌రైతు వార పత్రికలో కథనాన్ని ప్రచురించామని దేవదాయశాఖ మంత్రి 'ఆనం' అక్కసు కక్కారంటూ ఆ పత్రిక ఎడిటర్ నెల్లూరు డోలేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. తనపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఆదేశించారని, 'నాపై అభిమానం చూపిన పాత స్నేహితుడా థ్యాంక్స్, ప్లీజ్.. ఆ చర్యలేవో త్వరగా తీసుకోవాలంటూ ఆ ప్రకటనలో కోరారు. వాస్తవానికి జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో రెండో పంట పండించారని మంత్రి ఆనం స్వయంగా మీడియా ముఖంగానే ప్రకటించారన్నారు. ఆ లెక్కన 16 లక్షల పుట్ల వరి ధాన్యం పండిందని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా, మద్దతు ధరకు కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయింది నిజం కాదా?, ప్రభుత్వ అసమర్థ చర్యల వల్ల రబీ సీజన్ కంటే పుట్టికి రూ.5 వేలు తగ్గించి కొనుగోలు చేసింది నిజం కాదా? అని డోలేంద్ర ప్రశ్నించారు. రైస్ మిల్లర్లు సుమారు రూ.800 కోట్లు దోచుకున్నది కాదనలేని నిజమన్నారు. ఖరీఫ్ సీజన్ పంటకు సంబంధించి 58 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి కేవలం 300 పుట్లు ధాన్యం కొన్నామని మీ సహచర మంత్రి నారాయణ చెప్పారని, పండించిన 16 లక్షల పుట్లు ధాన్యం ఎక్కడ? మీరు కొనుగోలు చేసిన 300 పుట్లు ఎక్కడ?, ఇదేనా మీ సుపరిపాలన అని ప్రశ్నించారు. కేవలం వార్త రాసినందుకే తనపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడం చూసి, స్నేహితుడు ఇచ్చే బహుమానం అందుకోవాలని తొందరగా ఉందని మంత్రి ఆనమనుద్దేశించి డోలేంద్ర వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

అర్జీలిచ్చాం.. ఆలకించండి

- కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- పోటెత్తిన అర్జీదారులు



కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ హెల్త్ అసిస్టెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు రూరల్: క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని ప్రజలు కోరారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగా భవాని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

విధుల్లోకి తీసుకోవాలంటూ..

1207 జీఓలో ఉన్న 920 మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ ఆంధ్రప్రదేశ్ హెల్త్ అసిస్టెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 22 ఏళ్లగా పనిచేస్తున్న వారిని విధుల్లోకి తీసుకుంటామంటూ కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపిందన్నారు. కానీ ఇప్పటివరకు అఫిడవిట్ దాఖలు చేయలేదన్నారు. ఫైనల్ హియరింగ్ జరిగినప్పుడు నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించిందని, అయినా పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణలో విధుల్లోకి తీసుకున్నారని, ఏపీలో అలాగే చేయాలని కోరారు.

సర్వే చేయించాలని వినతి



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

'వెంకటాచలం మండలం కాకుటూరు పంచాయతీ సర్వే నంబర్ 2 నుంచి 68 వరకు, సర్వే నంబర్ 71 నుంచి 76, 407 వరకు ఉన్న భూమిలో 2,346 ప్లాట్లు వేశారు. చాలా వరకు ఆక్రమణకు గురయ్యాయి. డబుల్ రిజిస్ట్రేషన్లు చేశారు. సర్వే చేయించాలి' అని రఘువీర్ రియల్ ఎస్టేట్ లేఅవుట్ ప్లాట్ల యజమానుల కమిటీ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఆక్రమణకు గురైన కొన్ని ప్లాట్లు బుజబుజనెల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కూడా అయ్యాయన్నారు. సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని, అందుకు ఖర్చయ్యే మొత్తాన్ని చెల్లిస్తామన్నారు. డెవలపర్‌ను పిలిపించి లింక్ డాక్యుమెంట్లు పరిశీలించి సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, రవికుమార్, మనోహర్, ఆదిశేషయ్య ప్లాట్ల యజమానులు పాల్గొన్నారు.

పిల్లలతో కలిసి నిరసన



పిల్లలతో కలిసి నిరసన తెలుపుతున్న వీరరాఘవులు

'మా పొలం మాకు కావాలి. కలెక్టర్ గారూ స్పందించి న్యాయం చేయండి' అంటూ దుత్తలూరు మండలం భైరవరం పంచాయతీ జంగాలపల్లి గ్రామానికి చెందిన ఆర్.వీరరాఘవులు పిల్లలతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ తమకు పూర్వీకుల నుంచి వచ్చిన భూమిని దుత్తలూరు మండల రెవెన్యూ కార్యాలయ అధికారులు వేరే వ్యక్తుల పేర్లపై నమోదు చేశారని వాపోయారు.

అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు వినతి

నెల్లూరులో ఐటీడీఏ కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య కలెక్టర్‌కు వినతపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు కార్యాలయం పరిధిలో తిరుపతి, చిత్తూరు, కడప, ప్రకాశం, బాపట్ల తదితర జిల్లాలున్నట్లు చెప్పారు. చాలామంది పనుల నిమిత్తం వస్తారన్నారు. తగిన చర్యలు తీసుకోవాలని గత కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారని, ఇప్పటి వరకు స్పందన లేదన్నారు. చెంబెటి ఉష తదితరులు పాల్గొన్నారు.

ఈటీకు అండగా నిలవాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గొలగమూడి వెంకయ్య స్వామి ఆశ్రమ ఈఓ బాల సుబ్రహ్మణ్యంకు ప్రభుత్వం అండగా నిలవాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ జేసీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆశ్రమం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా బాలసుబ్రహ్మణ్యం కృషి చేశారన్నారు. కొందరు వ్యక్తులు ఆయనపై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవీఆర్ మోహన్‌రావు, పొట్లూరి శ్రీనివాసులు, చిట్టిబాబు, బుధవరపు బాలాజీ, సోమగోపాల్, నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

మా పేరుతో ప్లాట్లు ఇప్పించండి



మాట్లాడుతున్న మహిళలు

జలదంకి మండలం కేశవరం పంచాయతీ తిమ్మసముద్రం గ్రామ గిరిజనులు అధికారులను కలిశారు. వారు మాట్లాడుతూ 50 కుటుంబాలవారం ఐదేళ్లుగా గుడిసెలు వేసుకుని ఉంటున్నామన్నారు. కొందరు వచ్చి ఖాళీ చేయించి ఆక్రమించాలని చూస్తున్నారని వాపోయారు. పట్టాలు మంజూరు చేసి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు.

అనుమతి లేకుండా హాస్టళ్ల నిర్వహణ



కలెక్టర్‌కు విన్నవిస్తూ..

నెల్లూరు నగరంలో విద్యార్థుల ఆత్మహత్యలపై పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. నేతలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యాశాఖ అనుమతి లేకుండా ప్రైవేట్ విద్యాసంస్థలకు అనుబంధంగా హాస్టళ్లను నిర్వహిస్తున్నారని తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన డీఈఓ, ఆర్ఐఓ, మానసిక నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఒత్తిడితో ఉన్న ప్రతి విద్యార్థికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, రాష్ట్రాధ్యక్షుడు నరహరి శిఖరం, జేఏసీ నాయకులు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చట్ట పరిధిలో విచారించి న్యాయం చేస్తా

- బాధితులకు ఎస్పీ భరోసా



వీల్‌చైర్‌లో ఉన్న వ్యక్తి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైమ్): సమస్యలను చట్టపరిధిలో విచారించి న్యాయం చేస్తానని ఎస్పీ అజిత బాధితులకు భరోసానిచ్చారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. 121 మంది తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వాటిని పరిశీలించిన ఆమె ఆయా ప్రాంత పోలీసు అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ పి.సింధుప్రియ, నవాబుపేట, ఎస్బీ 2 ఇన్‌స్పెక్టర్లు టీవీ సుబ్బారావు, బి.శ్రీనివాసరెడ్డి, ఫిర్యాదుల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- కవిత, సాయి అనే ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.8.30 లక్షలు తీసుకుని మోసగించారు. వారిపై చర్యలు తీసుకోవాలని సైదాపురానికి చెందిన ఓ వ్యక్తి కోరాడు.
- పొలం సాగు చేసుకోనివ్వకుండా కుమారుడు రవిబాబు బెదిరిస్తున్నాడని ఇందుకూరుపేటకు చెందిన ఓ వృద్ధుడు ఫిర్యాదు చేశాడు.
- నా స్థలాన్ని ఆక్రమించి హరిశ్చంద్రారెడ్డి ఇంటిని నిర్మించుకున్నాడు. పొలానికి నీళ్లు వెళ్లకుండా ఇబ్బంది పెడుతున్నాడని రాపూరుకు చెందిన ఓ వృద్ధురాలు అర్జీ ఇచ్చారు.
- నెల్లూరు నగరానికి చెందిన పెంచలరాజు మా ఇంట్లో నమ్మకంగా పనిచేస్తున్నాడు. నా భర్త అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన సిమ్ కార్డును చోరీ చేసి యూపీఐ ద్వారా రూ.13 లక్షలు కాజేశాడు. తగిన చర్యలు తీసుకోవాలని దర్గామిట్టకు చెందిన ఓ మహిళ కోరారు.

నాగమ్మ కాలనీలో కార్డన్ సెర్చ్

- 13 మోటార్‌బైక్‌ల స్వాధీనం



వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు వేదాయపాళెం పోలీస్ స్టేషన్ పరిధిలోని బుజబుజనెల్లూరు నాగమ్మ కాలనీలో సోమవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. యజమానితోపాటు కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను సేకరించారు. వాహనపత్రాల్లేని 13 మోటార్‌బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. 13 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని వారి వివరాలను సేకరిస్తున్నారు. ఏడుగురు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేశారు. నేరనియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా నిర్వహిస్తున్న కార్డన్ సెర్చ్‌లకు ప్రజలు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మాదకద్రవ్యాల వినియోగంపై డయల్ 112, స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు విజయకుమార్, శ్రీనివాసరావు, ఏఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.40
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.15



పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరిట మోసం

- రూ.7.27 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు

నెల్లూరు(క్రైమ్): పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరిట ఓ యువతిని మోసగించి రూ.7.27 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నగరానికి చెందిన యాఫియా ఆగస్టు 31వ తేదీలో ఇన్‌స్టాగ్రామ్ చూస్తుండగా పార్ట్‌టైమ్ ఉద్యోగానికి సంబంధించి పోస్టు వచ్చింది. దానిపై ఆమె క్లిక్ చేయగానే కొందరు వాట్సప్ ద్వారా సంప్రదించారు. ఆన్‌లైన్ ఆర్డర్లు ఇస్తే రోజువారి జీతం, కమీషన్ ఇస్తామని నమ్మబలికారు. తొలుత కొంత మొత్తం డిపాజిట్ చేస్తే అదనపు ఆదాయంతో తిరిగొస్తుందని చెప్పారు. నమ్మిన ఆమె నగదు డిపాజిట్ చేసింది. వారిచ్చిన టాస్కలు పూర్తి చేసినా నగదు, కమీషన్ రాలేదు. ఈ విషయమై ఆమె వారిని సంప్రదించగా టాస్కలు సరిగ్గా పూర్తి చేయని కారణంగా నగదు బ్లాక్ చేశారని, అన్‌బ్లాక్ చేయాలంటే మరికొంత డబ్బు డిపాజిట్ చేయాలని చెప్పారు. దీంతో పలు దఫాలుగా రూ.7,27,248లు నిందితులు సూచించిన బ్యాంక్ ఖాతాల్లో జమ చేసింది. అయినా అన్‌బ్లాక్ కాకపోవడం, నిందితుల ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వీఎస్‌యూలో పోటీ పరీక్షల కేంద్రం ఏర్పాటు



డాక్టర్ విజేతను అభినందిస్తున్న వీసీ

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ క్యాంపస్‌లో పోటీ పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనికి డైరెక్టర్‌గా వర్సిటీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.విజేతను నియమించారు. సోమవారం వీసీ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కేంద్రం విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, ఇతర అధ్యాపకులు డాక్టర్ విజేతను అభినందించారు.

బంగారు నగల కోసమే హత్య

- సమీప బంధువే నిందితుడు

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట పంచాయతీ నక్కలకాలనీ సమీపంలో జరిగిన హత్యకు సంబంధించిన కేసును పోలీసులు ఛేదించారు. వల్లూరు మల్లికార్జున మెడలో ఉన్న బంగారు నగలు కోసమే సమీప బంధువు ఈ దారుణానికి పాల్పడ్డాడు. వెంకటాచలం పోలీసులు సోమవారం వివరాలు వెల్లడించారు. బుజబుజనెల్లూరు పరిధిలోని న్యూకాలనీలో నివాసముంటున్న మల్లికార్జున గత నెల 29 రాత్రి నుంచి కనిపించలేదు. 30 తేదీన నక్కల కాలనీ సమీపంలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. న్యూకాలనీలోనే మల్లికార్జున సోదరుడి కుమార్తె భర్త వెలగల పవన్ కల్యాణ్ ఉంటున్నాడు. అతను మల్లికార్జునను నగదు అడగ్గా ఇవ్వకపోవడంతో కోపం పెంచుకున్నాడు. కొంతసేపటి తర్వాత తన వెంట మల్లికార్జునను తీసుకెళ్లి మద్యం తాగించాడు. అనంతరం పక్కా ప్రణాళికతో హత్య చేసి అతని మెడలో ఉన్న బంగారు గొలుసు, ఉంగరం లాక్కొని పరారయ్యాడు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచగా, ఈనెల 17వ తేదీ వరకు రిమాండ్ విధించారు.

యువకుడి మృతదేహం లభ్యం



కోటయ్య మృతదేహం

నెల్లూరు సిటీ: పెన్నానదిలో ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం నలుగురు యువకులు రూరల్ పరిధిలోని జొన్నవాడకు సమీపంలో పెన్నానదిలో ఈతకు వెళ్లిన విషయం తెలిసిందే. గణేశన్ నరసింహ అనే యువకుడు చనిపోగా మృతదేహం లభ్యమైంది. దేవరపాళేనికి చెందిన కోటయ్య (24) గల్లంతవగా పోలీసులు గజ ఈతగాళ్లతో గాలించారు. సోమవారం ఉదయం అతని మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా



అవార్డులను అందజేస్తున్న కలెక్టర్

నెల్లూరు రూరల్: ప్రజలందరి భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతం అవుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో 2025 స్వచ్ఛత అవార్డుల ప్రదానోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములైతేనే పరిసరాలు పరిశుభ్రంగా మారుతాయన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ జిల్లాను రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల కృషితోనే పట్టణాలు పరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డీఈఓ బాలాజీరావు, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలా చనిపోయారో?

- వేర్వేరు చోట్ల ఇద్దరి మృతి

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. మద్యం తాగి అపస్మారక స్థితికి చేరుకుని మృతిచెందినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలో ఓ వైన్ షాపు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మూడో మైలు వద్ద ఆర్ఆర్ఆర్ మద్యం షాపునకు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని చెట్ల మధ్య స్థానికులు గుర్తించారు. వారి సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడి వయసు 45 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. మద్యం తాగి అపస్మారక స్థితికి చేరుకుని చనిపోయాడా?, మరేదైనా కారణం ఉందా? అని పోలీసులు విచారణ చేస్తున్నారు.

బస్ షెల్టర్‌లో మృతదేహం



కలిగిరి: మండలంలోని వెలగపాడులో గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న బస్ షెల్టర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. అతను నాలుగు రోజులుగా ఈ ప్రాంతంలో తిరుగుతున్నాడని గ్రామస్తులు తెలిపారు. మద్యం తాగి అపస్మారక స్థితికి చేరుకుని చనిపోయి ఉండొచ్చని చెబుతున్నారు. మృతుడి వయసు 45 సంవత్సరాలు ఉండొచ్చంటున్నారు. ఎస్సై ఉమాశంకర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి చొక్కా పామూరుకు చెందిన పవన్ మెన్స్‌వేర్‌లో కుట్టించినట్లు గుర్తించారు. శరీరంపై గాయాల్లేవు. మృతదేహాన్ని కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆచూకీ తెలిసిన వాళ్లు 94407 00098 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఎస్సై కోరారు.

భారీగా బాణసంచా ముడిసరుకు స్వాధీనం



ముడిసరుకును పరిశీలిస్తున్న పోలీసులు

ఇందుకూరుపేట: బాణసంచా తయారీకి ఉపయోగించే ముడిసరుకును మండలంలోని నిడుముసలి గ్రామంలో పోలీసులు భారీ స్థాయిలో స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా బాణసంచా తయారు చేస్తున్నట్టు సమాచారం అందడంతో ఎస్సై నాగార్జునరెడ్డి సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. ఏసురత్నం అనే వ్యక్తి నుంచి 120 కిలోల ముడిసరుకు, ఇంకా మూడు వేల టపాసులు (నెల్లూరు గన్లు) స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన మురళి వద్ద మరో 7 కిలోల ముడిసరుకు గుర్తించారు. ఎస్సై మాట్లాడుతూ దీనిపై కేసులు నమోదు చేశామన్నారు.

షాపు ఖాళీ చేయకపోతే చంపేస్తా

- రౌడీషీటర్ బెదిరింపులు

నెల్లూరు(క్రైమ్): అన్నావదినను చంపుతామని బెదిరించిన రౌడీషీటర్‌పై నెల్లూరు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. ముత్యాలపాళెంలో మహేష్‌కుమార్, కస్తూరమ్మ దంపతులు నివాసముంటున్నారు. మహేష్‌కుమార్ దివ్యాంగుడు. భార్య టైలరింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆస్తి విషయంలో మహేష్‌కుమార్‌ను కొంతకాలంగా అతని చిన్నతమ్ముడు శరత్‌బాబు (రౌడీషీటర్) వేధిస్తున్నాడు. శరత్‌బాబు ఈనెల 3వ తేదీన వదిన షాపులోని కుట్టుమెషీన్‌కు నిప్పంటించాడు. ఇల్లు, షాపు ఖాళీ చేసి వెళ్లకుంటే చంపేస్తామని బెదిరించాడు. మహేష్‌కుమార్ సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై పుల్లారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	: రూ.135
లేయర్	: రూ.122
బ్రాయిలర్ చికెన్	: రూ.242
స్కిన్‌లెస్ చికెన్	: రూ.266
లేయర్ చికెన్	: రూ.207

క్లుప్తంగా

విక్రమ సింహపురి విద్యార్థికి అవార్డు



రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పృథ్వీరాజ్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీలో బయో టెక్నాలజీ విభాగానికి చెందిన ఎం.పృథ్వీరాజ్ జాతీయ ఎన్ఎస్ఎస్ ఉత్తమ వలంటీర్ అవార్డును న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం ద్రౌపది ముర్ము చేతుల మీదుగా స్వీకరించాడు. సామాజిక సేవలో చేసిన విశేష కృషికి ఈ అవార్డు దక్కిందని వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు తెలిపారు.

రాళ్లపాడు నుంచి మృతదేహం వెలికితీత

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్ట్‌లో ఆదివారం గుర్తించిన మృతదేహాన్ని సోమవారం గజ ఈతగాళ్ల సాయంతో వెలికితీశారు. ఎస్సై నారాయణ కథనం మేరకు.. మృతుడు గుండు చేయించుకుని ఉన్నాడు. ముదురు నీలం రంగు ప్యాంట్ ధరించాడు. మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతదేహం ఉన్న తీరు చూసినవారు హత్య చేసి ప్రాజెక్ట్‌లో పడేసి వెళ్లి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.